# నిట్టూర్పు

లేదు సూరీ! లేదు... తెరిపిలేని ఈ ఫైళ్ళ పరంపరకు అంతులేదు.

చెదలపుట్టలా, బ్రహ్మజెముడులా తరిగినకొద్దీ పెరిగే ఈ ముళ్ళకంపకి నా జీవితమే అంకితమై పోయిందనీ, వీటి మధ్యే నేను నలిగి నశించిపోతున్నాననీ నీకు తెలీదూ?... అంతా తెలిసి కూడా ఎంత అమాయకంగా కంప్లైన్ చేస్తావు సూరీ! నేను వుత్తరాలు రాయడం లేదనీ, ఆశ్చర్యమేమిటంటే నువ్వూ నాలాంటి గుమాస్తావే అయికూడా ఇంకా జీవితంలో వెలుగులకోసం ఎట్లా వెతగ్గలుగుతున్నావా? అని. మన కాలేజీరోజులూ, అప్పటి స్వేచ్ఛావిహారాలూ, వూహాసౌధాలూ, ప్రేమకలాపాలూ ఇంకా ...ఇంకా నీకు జ్ఞాపకం వస్తయ్యా సూరీ? కవిత్వపు పిచ్చి నిన్నింకా వదల్లేదా? మీ టౌన్లో వున్న ఆ పాడుపడ్డ దేవాలయాన్ని ఎంతగా వర్ణించేశావు? ఆ వర్ణన ఎంత కృత్రిమంగా వుందో కూడా గమనించలేని పరిస్థితికి దిగజారిపోయావా సూరీ?

# ప సి డి బొ మ్మ

నన్నూ రాయమన్నావు. దేన్ని గురించి రాయను? ఈ ఆఫీసు నాలుగు గోడల మధ్య ఖైదీగావున్న నేను దేన్ని గురించి రాయను?... పోనీ, మా ఆఫీసు భవనం గురించి రాయనా? నీ పాడుపడ్డ దేవాలయంతో పోలిస్తే ఈ మహానగరంలో వున్న నా ఆఫీసు ఇంద్రభవనమై పోదూ! నిజంగా మా ఆఫీసు భవనం పేరుకూడా ఇంద్రభవనమేనని నీకుతెలుసా? పూర్వం ఏ మహారాజో నిర్మించుకున్న ఇంద్రభవనం ఇది. చుట్టుపక్కల కనుచూపు మేరలో ఎక్కడా పూరిల్లుగానీ, ఆఖరికి పెంకుటిల్లేనాగానీ కనుపించదు. అన్నీ దివ్యసుందర హర్మ్యాలే! వాటిలో నివసించే దేవతలూ, అప్సరసలూ కార్లల్లో షికార్ల కెళుతుంటే రోడ్డుపక్కన బస్సుకోసం నిలుచున్న నేను, ఒక్కొక్కసారి నన్ను నేనే మరిచిపోతుంటాను. కాని ఆ మరుక్షణం నా స్మృతి పథాన నా అద్దె కొంప, మురికి కాలువ, రోగిష్టి భార్య, చింకిరి గుడ్డల్లో పిల్లలూ, చంకలోవున్న ఆఫీసు ఫైళ్ళు కనిపించగానే వులిక్కిపడి తేరుకుంటాను. కలలు కరిగిపోతాయి; దేవలోకం లోంచి నన్నెవరో అమాంతంగా నరకకూపంలోకి తోసివేసినట్టనిపిస్తుంది... ఇది కవిత్వంకాదు సూరీ! కరడు కట్టిన కఠిన సత్యం! బూజుపట్టిన నీ దేవాలయపు కవిత్వంలోకంటే ఎన్నో రెట్లు నిజాయితీవుంది దీనిలో...

ఆఁ సుశీల ఏలావుందని అడిగావుకదూ? ఎల్లా వుంటుంది! ఎప్పటిలాగే క్షయతో క్షీణిస్తో హాయిగా కాలం వెళ్ళబుచ్చుతోంది. త్వరలోనే ముక్తి కలగవచ్చు— మొన్న సుశీలని చూసి వాసు ఏమన్నాడో తెలుసా? నేను హంతకుణ్ణట. ఆమె జీవితాన్నీ, అందాన్నీ, ఆనందాన్నీ హరించేస్తోన్న హంతకుణ్ణట. పువ్వుల్లో పెట్టి పూజించదగ్గ కోమలాంగిని చేతులారా చంపుకుంటున్న హంతకుణ్ణట!... సూరీ! వాసు విదేశాలకు వెళ్ళి చాలా విషయాలు నేర్చుకు వచ్చాడు. మనం పుస్తకాల్లో చదివి మురిసిపోయే విషయాలెన్నో వాడు కళ్ళారా చూసివచ్చాడు. అవన్నీ ఇక్కడ లేవేమో అని వాపోతాడు. విసుక్కుంటాడు... నా గురించీ, నా జీవిత విధానాన్ని గురించీ ఘంటన్నర లెక్చరిచ్చాడు. నీ దగ్గరికి వాడిని వాహ

సారి పంపిస్తాను. అక్కడ ఇంతకంటే పెద్ద లెక్చర్లిచ్చే అవకాశం వుంటుంది. నువు వోపిగ్గా వినాలి. వాడి మాటలు నిజంగా వినటానికి ఎంతో సొంపుగా, అందంగా వుంటాయి. ఆ కాస్త సేపూ మనమూ మనుషులమేనేమో అనే భ్రమకూడా కలుగుతుంది! అవును! ఇల్లా ఎందుక్కా-గూడదూ? అనే పిచ్చి ప్రశ్న హృదయంలో మొలకెత్తుతుందికూడాను...

నాలో రావలసిన మార్పుల నెన్నింటినో చాలా విపులంగా శాంతంగా బోధించాడు వాసు. ఇల్లు మార్చాలన్నాడు. పుష్టినిచ్చే ఆహారం తీసుకోవాలన్నాడు, మంచి మంచి మందులు వాడాలన్నాడు. వెంటవెంట దుస్తులు మార్చాలన్నాడు... నిజమే. ఈ మార్పులన్నీ రావాలి. నిజమే.. కాని... కాని సూరీ! నా ఈ గానుగెద్దు జీవితంలో మార్పు అంటూ వుందా? గానుగ జీవితాన్నుంచి తప్పించుకు పారిపోకండా నా మెడకు తగిలించిన ఈ ఆర్థిక దుస్థితిని ఏం చెయ్యను?... మరి ఇంతమంది పిల్లల్ని ఎందుక్కన్నావ్? అని నిలదీసి అడుగుతాడు వాసు. ఏంచెప్పను? నేను, నాకూ, నాభార్యా పిల్లలేకాక దేశానికే ద్రోహం చేస్తోన్న ద్రోహినంటాడు; ఏం చెప్పను? వెంటనే నన్ను ఇహామీదటేనా పిల్లలు కలగకండా ఆపరేషను చేయించుకోమంటాడు. ఏంచెప్పను ?... ఏమీ చెప్పలేక మొహం తేలేస్తే, నావేపు కోపంగా, జాలిగా చూస్తో, "నోరులేని పశువులు మీకంటే నయం!" అంటాడు వాసు... కాదన్నానా నేను!...

అదిగో ఆఫీసరు కాల్ బెల్ మోగుతోంది. టేబిలుపైని ఫైళ్లు కళ్ళెర్రజేస్తున్నాయి. నాకింతకంటే వ్యవధిలేదు. శెలవు.